

కథా కౌముది

# మళ్ళీ మళ్ళీ నువ్వా నేనే

లక్ష్మి గాయత్రి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

ఆఖరి క్షణాల అంపశయ్య మీద.. మృత్యుముఖంలో ఉన్న నీ నుదుటి మీద ఏ వ్యక్తి స్పర్శ అయితే నీ మరణబాధను పోగొట్టి, నిన్ను నువ్వు మర్చిపోయేలా చేసి, ఆ క్షణంలో కూడా నీకు దివ్యానందాన్ని ప్రసాదించగలదో, ఆ వ్యక్తికీ నీకూ గల అనుబంధమే ప్రేమ!!

★★★★★★★★★

కన్సల్టింగ్ రూం లో కూర్చుని ఉన్నాడు డాక్టర్ విశ్వపతి. ఎదురుగా కూర్చుని టేబిల్ మీదున్న రిపోర్టుల్ని తదేకంగా చూస్తున్నాడు డాక్టర్ కౌశిక్. ఇద్దరికీ అనిపిస్తున్నది ఒకటే... తాము ఎన్ని సార్లు చూసినా అవే రిపోర్టులు....ఒక్క అక్షరం కూడా మారదు! ప్రేమించే హృదయానికే గనక మానవాతీత శక్తులుంటే, ఆ అక్షరాలన్నిటినీ తారుమారు చెయ్యడం రెప్పపాటు పని!!

★★★★★★★★★★★

ఎర్రటి పూల పూల గౌను వేసుకుని వెన్నెల బొమ్మకి ఎర్ర మందారాలు అలంకరించినట్టు ముద్దుగా ఉంది కౌముది. నాలుగేళ్ల కూతుర్ని ఏడాది వయసు ఎక్కువ చెప్పి స్కూల్లో చేర్పేశాడు నరసింహం.

"ఎందుకయ్యా అంత తొందరా" అంటే, "అది బావని వదిలి ఉండదుటయ్యా. వాడు స్కూలుకి వెళుతూంటే ఒహటే ఏడుపు. "నాతో బాటు స్కూలుకి పంపెయ్ మావయ్యా" అని వాడే ఉపాయం చెప్పాడు. నాలుగు

రోజులు అలవాటయే దాకా మేష్టారితో చెప్పి తన దగ్గరే కూచోబెట్టుకుంటాట్ట. తర్వాత నెమ్మదిగా దాని క్లాసుకి పంపిస్తాట్ట. నాదేం లేదయ్యా.. అంతా వాడే చూసుకుంటాడు. వాడెలా చెబితే అలా.. "అంటూ గర్వంగా చెప్పుకొచ్చాడు.

"బావుందయ్యా...ఇప్పట్నించే పెళ్లాన్ని చూసుకుంటున్నాడు నీ అల్లుడు!"

"వాడి కోసం పుట్టి, వాడి కోసమే పెరుగుతున్నదాన్ని వాడు కాకపోతే మరెవడు చూస్తాడయ్యా... భలేవాడివే"

ఐదో క్లాసు చదువుతున్న విశ్వపతి చెయ్యి పట్టుకుని హాయిగా స్కూలుకి వెళ్లిపోయింది కౌముది. మొదటిరోజు స్కూలుకి వచ్చే వాళ్లు ఏడ్చినట్టు ఏడవక పోగా, బావ పక్కనే కూర్చుని పలక మీద బావ రాసిచ్చిన అక్షరాలు దిద్దుతున్న కౌముదిని మురిపెంగా చూశారు టీచర్లు. "బావ పక్కనుంటే నరకానికైనా నవ్వుతూ వెళిపోతుందీ పిల్ల" అనుకుని నవ్వుకున్నారు. ఆ బావా – మరదలూ వెయ్యిన్నొక్క కాలానికీ జంటగానే ఉండాలని మనసారా దీవించారు.

నరసింహం, జగపతి బాల్యం నుంచీ ప్రాణస్నేహితులు. తన చెల్లెలు సుమతిని జగపతికిచ్చి పెళ్లి చేసి, స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకున్నాడు నరసింహం. ఇద్దరివీ ఇరుగుపొరుగు ఇళ్లు. మధ్యలో గోడే అడ్డం. సుమతి పెళ్లి చేసుకుని పొరుగింటికి వెళ్లాక, ఆ సరిహద్దు గోడ కూడా కూల్చేసి, సుమతి పుట్టింటినీ అత్తింటినీ ఏకం చేసేశారు స్నేహితులు. తొమ్మిది నెలల పొట్టతో కూడా హాయిగా అక్కడికీ ఇక్కడికీ తిరిగేది సుమతి. మరో రెండేళ్లు గడిచేసరికి బుజ్జి విశ్వపతి "మాయ్యా" అంటూ బుడిబుడి నడకలు నడుస్తూ ఆ ఇంటికీ ఈ ఇంటికీ రాకపోకలు సాగించాడు. వాడి లేత పాదాలు మురికి అవుతాయని, కందిపోతాయని రెండిళ్లనీ కలుపుతూ నున్నని సిమెంటు బాట వేయించారు స్నేహితులు. పనివాళ్లు ఆ బాట రోజూ కడిగి ముగ్గులు పెట్టేవారు. బాటకి అటూ ఇటూ ఉన్న పొగడ చెట్లు కృష్ణ పాదాల్ని చూసి మురిసిపోతూ ఒత్తుగా పూలు రాల్చేవి. ఆ పూబాట మీద రాకుమారుడిలా తిరుగుతున్న విశ్వపతికి ఐదేళ్ల వయసొచ్చేసరికి ఈ ఇంట్లో శ్రీ మహాలక్ష్మి కేరుమంది.

పెళ్లి మాట వాయిదా వేస్తూ హాయిగా తిరుగుతున్న నరసింహాన్ని ఎవరో అడిగారు, "నువ్వు పెళ్లి చేసుకోకపోతే మరి నీ అల్లుడికి పిల్ల ఎక్కడినుంచొస్తుందయ్యా?! ఎవరో కన్న పిల్లని కట్టబెడతావా.."అని

ఛెళ్లున కొట్టినట్టయింది నరసింహానికి. ఒక్కసారిగా ఈ లోకంలో పడ్డాడు. నెల తిరిగేసరికి పేదింటి పిల్ల అయినా ఉత్తమురాలని పేరుబడ్డ లక్ష్మి మెడలో తాళి కట్టేశాడు. తమకి పుట్టబోయే కూతురు విశ్వపతికి కాబోయే ఇల్లాలని, అందుకు ఇష్టమైతేనే తనని మనువాడమని చెప్పి మరీ మంగళసూత్రం ముడేశాడు.

పున్నమి చంద్రుణ్ణి చూసి పొంగి పొంగి ప్రవహించే సముద్రంలా ఆ స్నేహితుల మనసుల్లో పొంగి పొర్లే స్నేహాభిమానాన్ని చూస్తే లక్ష్మికి ఎప్పుడూ ముచ్చటే. ఇప్పుడు తను కూడా ఆ ప్రవాహంలో ఒక అలలా ఇమిడిపోబోతున్నందుకు పరమానందపడింది. చిన్నారి విశ్వపతికి ఆజన్మాంతమూ తోడు కాబోయే బుజ్జాయిని తన కడుపున పుట్టించమని భగవంతుణ్ణి వేడుకుంటూ భర్త చేతుల మధ్య ఒదిగిపోయింది!

విశ్వపతి ఐదో పుట్టిన రోజు అయిన పదిహేను రోజులకి పాలకడలిలోంచి అప్పుడే ఉద్భవించిన శ్రీ మహాలక్ష్మిలా "తొలుకారు మెఱుఁగు కైవడి తళతళయని మేను మెఱయ, ధగధగ యనుచున్" నరసింహం దంపతులకు పాపాయి పుట్టింది. మేనగోడలి అందానికి పులకరించిపోతూ పాపకు "కౌముది" అని ప్రియమారా పేరు పెట్టింది సుమతి. "అంటే వెన్నెల అని అర్థం. నా కోడలు వెన్నెల బొమ్మ లా ఉంది" అని నలుగురికీ చెప్పింది.

చదువులో కూడా తెలివిగానే ఉంది కౌముది. ఐదో ఏడు నిండేసరికి రెండో క్లాసులోకొచ్చేసింది. అల్లరి కూడా పెరిగింది. కౌముదిని స్కూలుకి తీసుకువెళ్లడం, తీసుకురావడం గొప్ప తలనొప్పిగా తయారైంది విశ్వపతికి. తిన్నగా నడవదు. దారిలో కోడిపిల్ల కనిపించినా సరే దాని వెనక పరుగు తీస్తుంది. తిన్నగా నడవమని చెప్పి చెప్పి విసిగెత్తిపోయాడు విశ్వపతి. ఓరోజు మేకపిల్ల కోసం పరిగెడుతూ, ఎదురుగా వస్తున్న సైకిల్ ని గుద్దెయ్యబోయింది. సమయానికి సైకిల్ మీదున్నతను సైకిల్ ఆపెయ్యడంతో ప్రమాదం తప్పింది. సైకిలతను కౌముదిని తిట్టి వెళ్లిపోయాడు. దాంతో విశ్వపతి, కోపం పట్టలేక కౌముదిని ఒక్కటేశాడు.

ఏనాడూ లేనిది దెబ్బ తినేసరికి కౌముదికి విపరీతమైన ఉక్రోషం వచ్చింది.

"నన్ను కొడతావా... అత్తతో చెప్తానుండు" అంటూ మరుక్షణంలో తూనీగలా పరుగు లంకించుకుని, ఐదు నిమిషాల్లో ఇల్లు చేరి, ఆయాసపడుతూనే అత్తకి బావ మీద కంప్లైంట్ ఇచ్చేసింది.

కొడుకు కౌముదిని కొట్టాడనేసరికి సుమతి తెల్లబోయింది. నెమ్మదిగా ఏం జరిగిందో ఏమిటో కౌముదిని అడుగుతూ ఉండగానే విశ్వపతి వచ్చాడు. కొడుకు అంతా వివరంగా చెప్పాక, సుమతి మేనగోడల్ని దగ్గరకి తీసుకుని లాలిస్తూ, "బావకి కంగారేసిందే. నీ మీద ప్రేమతో గాభరా పడి కొట్టాడు. అంతే" అంటూ సర్ది చెప్పబోయింది.

అత్త మాటకి కౌముది కోరగా చూసి, "ప్రేమతో కొట్టాడా... ప్రేమతో ఎవరైనా ముద్దు పెట్టుకుంటారత్తా... కొట్టరు!" అంది.

ఆ మాటలు వింటూనే తల్లీకొడుకూ బిత్తరపోయారు! పదేళ్లు నిండిన విశ్వపతి, అప్రయత్నంగా "ఛీ" అన్నాడు.

"చూశావా... బావ మళ్లీ ఛీ అంటున్నాడు నన్ను! మావయ్యకి చెప్తా" కౌముది పరిగెత్తింది.

తల్లీ కొడుకూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు!!

మరో ఐదేళ్ల తర్వాత, మంచి ర్యాంక్ తో టెన్త్ పాసైన విశ్వపతిని రెసిడెన్షియల్ కాలేజీలో చేర్చడానికి ఏర్పాట్లన్నీ పూర్తయాయి. తెల్లారే ప్రయాణం.

రాత్రి పది గంటల వేళప్పుడు, విశ్వపతి దగ్గరకొచ్చింది కౌముది.

"బావా, ఇదిగో నాన్న నీకోసం కొత్త వాచీ తెచ్చాడు." అంటూ చెయ్యి చాపింది.

తన ప్రయాణం దగ్గరైనప్పటినుంచీ కౌముది డల్ గా ఉండటం గమనిస్తూనే ఉన్నాడు విశ్వపతి.

"అవునా... మావయ్యకి నేనంటే ప్రేమ కాబోలు. ప్రేమతో ముద్దు పెట్టుకుంటారని తెలుసు గానీ వాచీలూ అవీ కొంటారని తెలీదు." అన్నాడు.

పసిమిరంగులో ఉన్న కౌముది మొహం సింధూరం పూసినట్టు ఎర్రబడింది.

"బాబోయ్, నీకు కోపం వచ్చినట్టుంది. కొట్టకేం... అసలే నేను మళ్లీ ఆర్నెల్ల దాకా రాను" అన్నాడు తనే

ఆ మాట వినగానే కలువరేకుల్లాంటి కౌముది కళ్లు నీళ్లతో నిండిపోయాయి.

"నాకు తెలుసు. ఈ ఆర్నెల్లలో నీకు బోలెడంతమంది ఫ్రెండ్సవుతారని కూడా తెలుసు." అంటూ గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లిపోబోయింది.

గబుక్కున చెయ్యి జాపి కౌముదిని పట్టుకున్నాడు విశ్వపతి. దగ్గరగా వచ్చి బుగ్గ మీద గట్టిగా ముద్దు పెట్టుకుని, "పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకుండా బాగా చదువుకో. నేను నీకు ఉత్తరాలు రాస్తూ ఉంటాను. జవాబు రాయి. నాక్కూడా ప్రేమతో ఓ ముద్దు ఇచ్చేసి వెళ్లు" అన్నాడు.

పదకొండేళ్ల కౌముది కళ్లు నక్షత్రాల్లా వెలిగాయి. నూనూగు మీసాలూ, గడ్డంతో కొత్త కళ పుంజుకున్న బావ మొహాన్ని తృప్తిగా చూసి, బుగ్గ మీద అంటీ అంటనట్టు పెదవులు ఆన్చి ముద్దు పెట్టి, వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయింది.

★★★★★★★★★★★★★

"ఏవిఁటీ... పదకొండేళ్ల పిల్ల చేత ముద్దు పెట్టిస్తున్నావా? మతి ఉండే రాస్తున్నావా.. నువ్వు రాస్తున్నది యాభై ఏళ్ల కిందటి సంగతి. ఒంటిమీద తెలివి ఉంచుకో!"

"యాభై ఏళ్ల కిందటిది కాబట్టే బుగ్గ మీద.. అదీ అంటీ అంటనట్టు పెట్టించాను. అదే ఈ క్షణం సంగతైతే లిప్ లాక్ పెట్టి ఉండేవాణ్ణి!"

"రామ రామా... "

"శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథలేమైనా చదివావా"

"కావలసినన్ని.. "

"అవన్నీ వద్దు గానీ, కన్యాకాలే యత్నాద్వరితా" చదివావా?!

"చదివా...ను!"

"అప్పుడే  నీరసపడిపోయింది నీ మాట. సరే, విను. శాస్త్రిగారు కాలం చేసే అరవై ఏళ్లు దాటింది. మనకి స్వాతంత్ర్యం రాక ముందు కాలం నాటి కథ అది. కథానాయిక రంగనాయిక నాయకుడితో ప్రేమలో పడే వేళకి ఆమె వయసు అచ్చంగా పదకొండేళ్లు. దొర విచారణ సాగిస్తూండగా ఆమె చెబుతున్న మాటలు విని, తన పదకొండేళ్ల కూతురు

కూడా ఇలాగే ఏ కుర్రాడితోనైనా మాటలు కలిపి "చెడిపోతోం"దేమోనని సర్కిలు భయపడతాడు. అవునా.. అది డెబ్భై ఏళ్ల క్రితం వాతావరణం. ఐదారేళ్ల క్రితం వార్తల్లో సంచలనం సృష్టించిన అమృత గుర్తుందా?!"

"ఆఁ"

"స్కూలు స్థాయిలోనే బాయ్ ఫ్రెండ్ లేని ఆడపిల్లా, గర్ల్ ఫ్రెండ్ లేని మొగపిల్లాడూ లేరని ఢంకా బజాయించి చెప్పింది అమృత. ఆ పిల్ల మాటలు అంత వాస్తవాలు కాబట్టే రామ్ గోపాల్ వర్మ సినిమా కూడా తీసేశాడు. అవునా.. కాదా..?!"

"అయితే ఏమిటంటావు..?!"

"ఏమీ లేదు. అష్ట వర్షాత్ భవేత్కన్యా" అని పెద్దవాళ్లు ఊరికే చెప్పలేదు. ఎగబాకే స్థితికి ఎదిగిన తీగకి మనం వెదుళ్లతో చక్కని పందిరి వేస్తే అది అందంగా దాని మీద అల్లుకుంటుంది. అలా వదిలేస్తే నేల మీదా, ముళ్లకంచెల మీదా, బురద మీదా కూడా పాకుతుంది."

"అయితే ఇప్పుడు ఏమిటంటావు నువ్వు?! బాల్య వివాహాల్ని పునరుద్ధరించాలంటావా?!"

"ఆ మాట అంటూ నేను కథ రాస్తే, మంచి ఎడిటర్ అయితే నా కథని చెత్త బుట్ట లో పడేస్తాడు. కోపిష్టి ఎడిటర్ అయితే, నా కథ పబ్లిష్ చేసి, పాఠకుల్ని నా మీదికి ఉసి గొల్పుతాడు. అంచేత అలాంటి పని ఎప్పుడూ చెయ్యను. దొండకాయ కూర కోసమో, దొరకని సినిమా టిక్కెట్ల కోసమో కూడా పోట్లాడుకుని, కోర్టుకెక్కి విడాకులు తీసుకుంటున్న జంటలున్న ఈ రోజుల్లో, లేత వయసు నుంచీ మమతల్ని అల్లుకుంటే ఎలా ఉంటుందో, ఆ నాటి మనుషులూ మమకారాలూ ఎలా ఉండేవో కొంచెం చెప్పాలనిపించింది. ఉబుసుపోని కథే అనుకో... నాకు వేరే పనీ పాటూ లేవుగా.. అందుకని రాసుకుంటున్నాను."

" సరేలే. ..చదూ. విశ్వపతికీ కౌముదికీ పెళ్లి చేసే ఉంటావు. బావామరదళ్లకి పెళ్లి చేస్తే ఏవుంది... పురటాలి విస్తట్లో నలుపెక్కిన పాతావకాయ ముక్క! కానీ.. "

"పెట్టవలసిన తీరులో పెడితే మరసటేడుక్కూడా ప్రియురాలి నెమ్మోవిలా ఎర్రెర్రగా చవులూరిస్తుంది ఆవకాయ! బాలింత పత్యానిక్కూడా భేషుగ్గా పనికొస్తుంది."

"ఓహో... చూద్దాం అదేవిఁటో.. కానీ"

★★★★★★★★★★★★★★★★

"బావొచ్చేస్తున్నాడు. పెళ్లికి ముహూర్తం పెట్టించెయ్యమన్నాట్ట.. " సిగ్గు, ఆనందం కలిసి కలనేత చీరలా మొహం మెరుస్తూండగా చెప్పింది కౌముది.

"ఏంటో... బావతో పెళ్లికి ఇంత మురిసిపోతున్నావు. పాత చింతపండూ బావామరదళ్ల పెళ్లీ ఒకటే!" కించిత్ నిరసనగా అంది రమణి.

తను విశ్వపతి ఊసెత్తినప్పుడల్లా స్నేహితురాలు ఇలా మాట్లాడటం కౌముదికి అలవాటే. "ఆధునికంగా బతుకుతా"నంటూ పదిసార్లు చెప్పే రమణి ఈ మధ్యే ఒక క్రిస్టియన్ ని ప్రేమిస్తున్నానని చెబుతోంది. ప్రేమకి ఏ అడ్డుగోడలూ ఉండవంటూ బల్లలు విరక్కొడుతోంది.

రమణి ధోరణి అలవాటైనా ఈసారి ఎందుకో ఊరుకోలేకపోయింది కౌముది.

"ఊఁ... ప్రేమిస్తే బావుంటుందా..?!" మామూలుగా అడిగింది.

"చాలా.. చాలా బావుంటుంది!" మెరుస్తున్న కళ్లతో ఆనందంగా చెప్పింది రమణి.

"మొన్న నా పుట్టినరోజున డేవిడ్ సినిమాకి తీసికెళ్లాడు. సినిమాలో హీరో, హీరోయిన్ ఫస్ట్ నైట్ సీనొచ్చేసరికి గబుక్కున నన్ను ముద్దు పెట్టేసుకున్నాడు. అలాంటి దొంగ ముద్దులు ఎంత బావుంటాయో.. " పరవశించిపోతోంది రమణి.

"అవునా... అదే పదహారేళ్ల వయసులో అయితే..?!"

"వావ్... అద్భుతంగా ఉంటుంది"

"నా ఇంటర్ రిజల్ట్స్ వచ్చిన రోజున ఇక్కడే ఉన్నాడు బావ. అప్పటికి తన మెడిసిన్ థర్డ్ ఇయర్ అయింది. సెలవులకి వచ్చాడు. నేను ఫస్టు క్లాస్ లో మంచి ర్యాంక్ తో పాసైనట్టు తెలియగానే మా అత్త నన్ను గట్టిగా కౌగలించుకుని ముద్దు పెట్టుకుంది. ఆ తర్వాత సాయంత్రం ఎవరి పనుల్లో వాళ్లుండగా బావ నన్ను గదిలోకి లాక్కెళ్లి ముద్దు పెట్టుకున్నాడు. తన మీసాలు గుచ్చుకుని నా ఒళ్లు ఎలా జలదరించిందో తల్చుకుంటే ఈ క్షణంలో కూడా మళ్లీ జలదరిస్తుంది ఒళ్లు. ముద్దు పెట్టుకుని, "ప్రేమతో పెట్టిన ముద్దు" అంటూ ఏడిపించాడు. ఎప్పుడో ఐదేళ్ల వయసులో "ప్రేమతో ముద్దు పెట్టుకుంటారు గాని కొట్టరు" అన్నానట. అందుకని "ప్రేమతో ముద్దు" అని ఏడిపిస్తాడు."

నోరు తెరుచుకుని వింది రమణి!

"అప్పుడే ఏమైంది... నేను బిఎస్సీ సెకెండియర్ లో ఉండగా అరకు టూర్ వెళ్లాం. అప్పటికి బావ ఢిల్లీ ఎయిమ్స్ లో పీజీ పరీక్షలు ముగించుకుని వచ్చాడు. నన్ను అరకు వెళ్లనిచ్చి, వెనకాలే తను కారేసుకుని వచ్చాడు. మా మేడమ్ కి చెప్పి, పర్మిషన్ తీసుకుని ఇద్దరం రహస్యంగా అనంతగిరి వెళ్లిపోయాం. అక్కడ రెండు రోజుల పాటు కాటేజీ తీసుకుని అన్ మేరీడ్ లవర్స్ థ్రిల్ అనుభవించాం. ఒకే మంచం మీద పడుకున్నా, గుండెల్లో దాచుకోవడమే గాని హద్దు మీరని సంస్కారం బావది!"

రమణి కళ్లార్పడం కూడా మర్చిపోయింది!

కౌముది ఇంకా చెబుతూనే ఉంది.. " నా చేత తొలి అక్షరం దిద్దించింది బావ. నాకు చిన్నప్పుడు సైకిలు, బిఎస్సీలో ఉండగా కారు నేర్పింది బావ. ఎమ్మెస్సీ పూర్తయే దాకా నాకు  చదువులో ఎప్పుడు ఏ డౌట్ వచ్చినా తీర్చింది

బావ. తనకి తెలియనిదైతే తన ఫ్రెండ్స్ చేత చెప్పించేవాడు. నా పెదవులకి తొలిసారి లిప్ స్టిక్ దిద్దింది బావ. నాకు సౌందర్య సాధనాలన్నీ తనే కొని తెచ్చేవాడు. ఇప్పుడు పెళ్లికి నాకు మేకప్ బాక్స్ లండన్ నించి తనే తెస్తున్నాడు!"

రమణి మాట్లాడలేదు!

కౌముది కొనసాగించింది... "ఇవన్నీ ఒక ఎత్తు. మేనరికం కాబట్టి మాకు పుట్టబోయే పిల్లలు ఎలా ఉంటారో అని రెండేళ్ల కిందటే బ్లడ్ టెస్టులవీ చేయించాడు. ఏమాత్రం అనుకూలంగా లేకపోయినా పిల్లల్ని కనే ప్రసక్తే లేదని మా పెద్దవాళ్లు నలుగురికీ ఖచ్చితంగా చెప్పాడు. అయితే భగవంతుని దయ వల్ల మా ఆరోగ్యాలు మాకు అనుకూలంగానే ఉన్నాయి. అయినా సరే, వైద్య సదుపాయాలు చాలా బావుంటాయని మాకు ఒక బిడ్డ పుట్టేవరకూ లండన్ లోనే కొనసాగడానికి నిశ్చయించుకున్నాడు. నాకు పాస్ పోర్ట్ ఎప్పుడో వచ్చేసింది. వీసాకి అప్లికేషన్ పెట్టాను. పెళ్లవగానే నేను కూడా లండన్ వెళ్లిపోతున్నాను. లోకంలో మిగిలిన బావామరదళ్లందరూ ఎలా ఉంటారో నాకు తెలీదు. మా బావ మాత్రం నాకు బాల్య స్నేహితుడు, మార్గదర్శి, గురువు, ప్రియుడు, భర్త !! నేను కూడా తనకి అంతేనని నాకు తెలుసు!!"

★★★★★★★★★★★★★★

లేత గులాబీ రంగులో ఉన్న ఆమె అరచేతుల్లో ముత్యాల తలంబ్రాలు కెంపుల్లా మెరిశాయి! అతడి కొంటె నవ్వుల వాడికి ఆమె బుగ్గలు బ్లష్ చేసినట్టు ఎర్రబడ్డాయి. మంగళసూత్రంతో తనని బంధించి, భర్తగా తొలిసారి తన పక్కన కూర్చున్న అతడు, ఆమెకి, "నిను మౌళి దాల్చి మృత్యుంజయమూర్తినై జమునితో తొడగొట్టి సవాలు సేతునా... " అంటున్నట్టు కనిపించాడు. తన ముందు తొలిసారిగా తల వంచుకుని కూర్చున్న నెచ్చెలి అతడికి, "నీతోటే ఉంటాను నాయుడు బావా.. నీ మాటే యింటాను నాయుడు బావా" అంటున్న ఎంకిలా కనిపించింది. తమ కలలు పండిన శుభవేళ, నూతన దంపతులు కౌముది – విశ్వపతి ఇద్దర్నీ ఆనందంగా ఆశీర్వదించారు పెద్దలు నలుగురూ!!

మరో మూడేళ్ల తర్వాత లండన్ లోని క్వీన్స్ హాస్పిటల్ లోంచి పండంటి కొడుకును ఎత్తుకుని ఆనందంతో పొంగిపోతూ బైటికొచ్చి కారెక్కింది కౌముది, మిసెస్ డాక్టర్ విశ్వపతి!!

చాలా సంవత్సరాల తర్వాత.......

అతడి కౌగిలిలో ఒదిగిపోయి,కళ్లు మూసుకుని ఆ సాన్నిహిత్యపు మాధుర్యాన్ని నిశ్శబ్దంగా ఆస్వాదిస్తోందామె! ఆ ఇంతి మనసు కూడా అంతే నిశ్శబ్దంగా అతడి గుండెతో గుసగుసలాడుతోంది...

"ఏడంతస్తులమేడలు నాకెందుకూ?! నా నెనరు వెచ్చని కాపురం నా చుట్టూ అల్లుకున్న నీ చేతుల పొదరింట్లోనే కదా! సౌందర్య సాధనాలేమీ నాకక్కరలేదు... వలపు మధువులు చిందే నీ పెదవులు నా దేహాన్నంతటినీ అమృతంతో ప్రక్షాళిస్తాయి. తొలిపొద్దు వేళ, ఆకాశంలో మిగిలిన ఒంటరి నక్షత్రం, నన్ను వీడని నా తుంటరి తోడుని చూసి ఎంత కుళ్లుకుంటోందో చూశావా?! ఇదిగో ఈ వర్షాకాలపు రాత్రి, పిడుగును పేల్చి నన్ను భయపెట్టాలనుకుంటోంది. నీ గుండెకు చేరువగా ఉన్న నా చెవులకు నీ గుండె పిలుపు తప్ప మరేమీ వినబడదని దానికి

తెలీదు పాపం! దేవుడు సైతం నన్ను చూసి నీరసపడుతున్నాడు.. నా భక్తీ, నా ప్రార్ధనా నా పూజా నా నోమూ అన్నీ నా ప్రేమైకమూర్తికే కదా! వేరే దేవుడెందుకూ నాకు?!"

ఫోన్ మోగింది.

ప్రియురాలి సాన్నిధ్యంలో ఇహలోకాన్ని మర్చిపోయిన అతడు ఉలికిపాటుగా కదిలి, తప్పనిసరిగా విడివడి, టేబిల్ మీద ఉన్న సెల్ అందుకున్నాడు.

"డాడీ... " అవతలి నుంచి ఏడుపు దిగమింగుతున్నట్టు స్పష్టంగా తెలిసింది.

"కాశీ...."

"........." నిశ్శబ్దం!!

డాక్టర్ విశ్వపతికి అర్ధమైంది.

"వస్తున్నాను...!" క్లుప్తంగా జవాబు చెప్పి ఫోన్ ఆఫ్ చేశాడు.

చిరునవ్వుతో చూస్తోంది కౌముది.

కొంతమందికి ఏ రోగమూ లేకుండా హాయిగా ఉన్నా మొహంలో జీవకళ ఉండదు! కొంతమంది.... ప్రపంచానికీ అయినవాళ్లకూ వీడ్కోలు చెప్పేసినా వాళ్లని "శవం" అనబుద్ధి కాదు. నిత్య నూతనమైన తేజస్సూ, దైవీకళా వారికి భగవత్ప్రసాదితం! డాక్టర్ గా తన నలభై ఐదేళ్ల  అనుభవం నిగ్గు తేల్చిన సత్యమది! ఈ నలభై ఐదేళ్లలో ఎన్ని జీవచ్ఛవాలనూ ఎన్ని నిర్జీవ తేజోపుంజాలనూ చూశాడో?! కానీ.. కానీ.. నిద్దట్లో కూడా "బావా.. " అంటూ కలవరించే ఈ చైతన్య స్రవంతిని నిశ్చలంగా చూడటం.....

గుండెల్లోంచీ తన్నుకొస్తున్న ఉద్వేగాన్ని అణచుకుంటూ, కౌముదిని సమీపించాడు విశ్వపతి. కొద్దిగా వంగి భార్య బుగ్గ మీద నునులేత ముద్దిచ్చి, "ప్రేమతో ఇచ్చిన ముద్దు" అంటూ కన్ను కొట్టి, తన కళ్లలో ఊరుతున్న చెమ్మ భార్య కంటపడే లోపు బైటికి నడిచాడు!!

★★★★★★★★★★★★

ధన్వంతరి కేన్సర్ హాస్పిటల్!!

దక్షిణాదిన పేరుకెక్కిన ఆంకాలజిస్ట్ డాక్టర్ విశ్వపతి ముప్పై ఐదేళ్ల  కిందట నెలకొల్పిన ఆస్పత్రి అది. తండ్రి ఛాంబర్ లో అతడికి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని టేబిల్ మీదున్న రిపోర్టుల్ని తదేకంగా చూస్తున్నాడు డాక్టర్ కౌశిక్. ఇద్దరికీ అనిపిస్తున్నది ఒకటే... ఎన్ని సార్లు చూసినా అవే రిపోర్టులు....ఒక్క అక్షరం కూడా మారదు! ప్రేమించే హృదయానికే గనక మానవాతీత శక్తులుంటే, ఆ అక్షరాలన్నిటినీ తారుమారు చెయ్యడం రెప్పపాటు పని!!

విశ్వపతి కుర్చీలో వెనక్కి వాలి, కళ్లు మూసుకుని దీర్ఘాలోచనలో ఉన్నాడు. పుట్టిన ప్రతి వాడూ ఎప్పుడో ఒకప్పుడు గిట్టక తప్పదు. తమ వయసులు కూడా చిన్నవేమీ కావు. తనకి డెబ్భై.. కౌముదికి అరవై ఐదు. జీవితాన్ని

పరిపూర్ణంగా అనుభవించారు తామిద్దరూ. అంచేత ఇప్పుడు సమయం ఆసన్నమైందంటే అందులో దొర్లి దొర్లి ఏడవడానికేమీ లేదు. కాకపోతే తన భయమల్లా ఒక్కటే... కౌముది.. తన మిక్కీ లేకుండా...అరవై ఐదు సంవత్సరాల అల్లిక రెండు ముక్కలైపోయాక, తను ఎన్ని కోట్ల క్షణాలు గడపాలి?! తన టైమెప్పుడు?! పదేళ్ల క్రితం తనకి హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు కూడా ఇదే భయం. తను లేకుండా మిక్కీ ఎలా?! ఉండగలదా... ఊపిరి పీల్చగలదా?!

పోయిన వాళ్లతో ఎవరూ పోరు. భర్త పోయిన భార్యలూ, భార్య పోయిన భర్తలూ బోలెడంతమంది. అన్నిటినీ మరిపించేది కాలమే. అందరూ క్రమేపీ సర్దుకుని మళ్లీ మామూలుగా జీవించడానికి అలవాటు పడతారు. అందులో ఆశ్చర్యం గానీ, తప్పు గానీ ఏమీ లేవు. కానీ, తాము అలా జీవించగలరా..??!!

"ఏం చేద్దాం డాడీ, అమెరికా తీసుకుపోదామా" ఏడుపు గొంతుతో అడుగుతున్నాడు కౌశిక్. తనకీ కౌముదికీ పెళ్లయిన మూడేళ్లకి పుట్టిన మురిపాల బిడ్డ. వాడికి ఏడేళ్ల కొడుకున్నాడు. అయినా ఇప్పటికీ వాడు అమ్మ కొంగు పట్టుకు తిరిగే పిల్లాడే. వాడేమిటి, కోడలు, మనవడు అందరూ తెల్లారి లేస్తే కౌముది చుట్టూ పరిభ్రమించే వాళ్లే ! అల్లిబిల్లిగా అల్లుకున్న తమ సంసారలతకి తల్లివేరు ఆమే!!

కొడుకు ప్రశ్నకి చిన్న నవ్వు నవ్వాడు విశ్వపతి. "ముందుగా తెలిస్తే మనం ఇలాంటి ఉపాయాలు పన్నుతామనే, ఆఖరి క్షణం వరకూ మనకి తెలియకుండా దాచాడు కౌశీ, ఆ భగవంతుడు! రిపోర్ట్ మరోసారి చూడు... చాలా అడ్వాన్స్ డ్ స్టేజిలో ఉంది. ఏ ట్రీట్ మెంటూ లాభం లేదు."

"అలా అని ఊరుకుంటామా డాడీ.. " కౌశిక్ గొంతులో కోపం.

"ఊరుకోవడమే ఉత్తమం. అలా వదిలేస్తే మహా అయితే ఒక నెల బతుకుతుందేమో... అంతే! కానీ ఈ నెలా ప్రశాంతంగా బతుకుతుంది. నువ్వు ట్రీట్ మెంట్ మొదలుపెడితే, దానివల్ల శారీరక బాధ సంగతి అలా ఉంచు, రోజులు దగ్గర పడుతున్నాయన్న యాతన ఎక్కువైపోతుంది. నిన్న గాక మొన్న ఒక పేషంట్ పోయింది. సరిగ్గా మీ అమ్మ వయసే. ఇప్పటికి ఆరు నెలల నుంచీ ట్రీట్ మెంట్ తీసుకుంటోందావిడ. అయినా లాభం లేకుండా పోతోందన్న విషయం ఆమెకి తెలుసు. చనిపోయే ముందు రోజు నేను రౌండ్స్ కి వెళితే ఏమని ఏడ్చిందో తెలుసా... "మరొక్క రెండేళ్లో మూడేళ్లో నన్ను బతికించలేరా?! మా ఆయన నా కంటే పదేళ్లు పెద్దవాడు. ఈ మధ్య ఆరోగ్యం కూడా అంత బావుండటం లేదు. మాకు పిల్లలు లేరు. నేను పోతే ఆయన దిక్కూ దివాణం లేని వాడైపోతాడు. లేవలేకపోతే కప్పు కాఫీ ఇచ్చే దిక్కు కూడా లేదు" అంటూ ఏడ్చింది. అఫ్ కోర్స్ నా పరిస్థితి వేరనుకో..." విశ్వపతి మాట పూర్తి చెయ్యలేకపోయాడు. గొంతు పెగలలేదు. గుండె బరువెక్కింది.

మరో ఐదు నిమిషాలు గడిచేసరికి అది బాధతో గుండె బరువెక్కిన ఫీలింగ్ కాదనీ, తీవ్రమైన మానసిక ఒత్తిడి కారణంగా రక్త ప్రసరణ లో మార్పులు వచ్చాయనీ, ఆ ప్రభావం గుండె మీద పడుతోందనీ అతడికి అర్థమైంది. అప్రయత్నంగానే అలవాటు చొప్పున జేబులో ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకునే టాబ్లెట్ తీసి

వేసుకున్నాడు. కళ్లు మూసుకుని ఉచ్ఛ్వాస, నిశ్వాసల మీద దృష్టి కేంద్రీకరించి, క్రమబద్ధంగా ఊపిరి తీసుకోవడం ప్రారంభించాడు. పది నిమిషాల్లో అంతా సర్దుకుంది. "హమ్మయ్య" అనుకుంటూ ఉండగా బుర్రలో ఏదో మెరుపు మెరిసింది.

పదేళ్ల కిందట హార్ట్ ఎటాక్ వచ్చిన దగ్గర నుంచీ తను చాలా పద్ధతులు మార్చుకున్నాడు. ఆహారం, వ్యాయామం, నిద్ర అన్నిటినీ క్రమబద్ధం చేసుకున్నాడు. అది గాక మందులు వాడుతున్నాడు. ఇప్పుడు ఆ రోజువారీ మందులు ఆపేస్తే చాలు... హేపీగా కౌముదితో కలిసి వెళ్లిపోవచ్చు. కొద్దిగా ముందు వెనుకలు అయితే అవుతుందేమో గాని పెద్ద తేడా ఉండదు. విశ్వపతి మనసు కుదుట పడింది!

నెమ్మదిగా పదిహేను రోజులు గడిచాయి. కౌముది ఆరోగ్యం బాగా దిగజారిపోయింది. నడిస్తే కూడా బాగా ఆయాసం వస్తోంది. ఇటు విశ్వపతి కూడా మెట్లు ఎక్కలేకపోతున్నాడు. మెట్లెక్కినా, ఒక ముద్ద ఎక్కువ తిన్నా ఆయాసం వస్తోంది. ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడుతున్నాడు.

ఆ రోజు రాత్రి, బాగా నీరసంగా ఉందని కౌముది చాలా తొందరగా పడుకుని నిద్రపోయింది. పన్నెండు దాటాక ఆమెకు మెలకువ వచ్చింది. కళ్లముందు వలయాలు తిరుగుతున్నాయి. శరీరంలో శక్తినంతటినీ ఎవరో గుంజేస్తున్నట్టుగా ఉంది. శరీరంలో ఎక్కడో భరించలేని బాధ. ఎక్కడో ఏమిటో కూడా సరిగ్గా తెలియడం లేదు. లోలోపల మెలికలు తిరుగుతున్న అనుభూతి. విపరీతమైన మత్తుగా ఉంది. కళ్లు వాలిపోతున్నాయి. కాని, నిద్ర కాదు. తనకి చివరి క్షణాలు వచ్చేశాయని అర్ధమైంది కౌముదికి. "బావ... బావ ఏడీ" శక్తి కూడదీసుకుని పక్కకి చూసింది. పక్కనే విశ్వపతి ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. అతడిని చూడగానే కౌముది పెదవుల మీద చిరునవ్వు కదిలింది.

తన ఆఖరి క్షణాల అంపశయ్య మీద తన పక్కనే ఉన్నాడు బావ! "బావ చెయ్యి గట్టిగా పట్టుకో" చిన్నప్పుడు తండ్రి చెప్పిన మాట గుర్తొచ్చింది. నెమ్మదిగా పక్కకి తిరిగి విశ్వపతి చేతిని గట్టిగా పట్టుకుంది. ఆ స్పర్శకి కదిలాడు విశ్వపతి. నిద్దట్లోనే చెయ్యి జాచి కౌముది చెక్కిలి తడుముతూ, "మిక్కీ.." అన్నాడు అస్పష్టంగా.

కౌముది ఏమీ మాట్లాడకుండా భర్త చేతిమీద తన చెయ్యి వేసి గట్టిగా పట్టుకుంది. ఆ స్పర్శ... పుట్టినదాదిగా తనకు మచ్చికైన స్పర్శ... సుఖదుఃఖాలన్నిటా తనదైన ఆ స్పర్శ.. ఈ ఆఖరి క్షణంలో సైతం తనకి ఎంత ఓదార్పునిస్తోందో?!! కౌముది మనసు మాట్లాడటం ప్రారంభించింది...

"టైమైపోయింది బావా. బయల్దేరుతున్నాను. నా ఈ ఆఖరి ప్రయాణం గురించి నాకు తెలియదనుకున్నావు కదూ.... విదేశాలు గౌరవించిన ఆంకాలజిస్టు భార్యని. ఆ మాత్రం తెలుసుకోలేనా?! ఎలాగో తెలిసింది. తెలిశాక మాత్రం చాలా భయం వేసింది బావా. ఏ పుణ్యం చేశానో.. ఎంత పాపం చేశానో.. ఏ వైతరణి దాటాలో.. ఏ చీకటి దారుల్లో నడవాలో... భయంతో వెక్కి వెక్కి ఏడ్చాను. ఆ మర్నాడే గమనించాను నువ్వు మందులు

వేసుకోవడం మానేశావని. నీ మందులన్నీ నాకు గుర్తే. నువ్వు సరిగ్గా వేసుకుంటున్నావా లేదా అని ఎప్పుడూ చూస్తాను. ఇప్పుడు నువ్వు మందులు వేసుకోవడం లేదని అర్థమయాక ఎంత ఆనందంగా అనిపించిందో?! నాతో బాటు ప్రయాణానికి నువ్వు కూడా సిద్ధమవుతున్నావని గ్రహించాక, నా భయమంతా పోయింది. "బావ చెయ్యి గట్టిగా పట్టుకోమ్మా" అని ఎప్పుడూ చెప్పేవాడు నాన్న. మృత్యువు నీ చెయ్యి నాకు అందకుండా చేస్తుందని భయపడ్డాను. కానీ, మృత్యుంజయుడు ఈ క్షణంలో కూడా నాకు నీ చేతి ఆసరా ఇస్తున్నాడు! మొగుడి చావుకి ఆనందించే ఆడది ఎవర్తైనా ఉంటుందా...ఇలా సంతోషించడం పాపం కాదూ... బావా, ఇంక నా వల్ల కాదు. పాపం.. పుణ్యం పరమాత్ముడికెరుక. నాకు కావలసిందల్లా నువ్వు!! పునరపి మరణం..పునరపి జననం..మళ్లీ పుడదాం బావా..మళ్లీ మళ్లీ ...నువ్వూ నేనే"

కౌముది నెమ్మదిగా చేతి మీద లేచి విశ్వపతి బుగ్గ మీద పెదవులు ఆన్చింది. సిగ్గుతో అంటీ అంటనట్టు పెట్టిన తొలిముద్దు... నిస్సత్తువతో కేవలం పెదవుల్ని బుగ్గకి తాకించి పెట్టిన ఈ చివరిముద్దు దేనికదే ముద్ర వేసుకున్నాయి!!

కౌముది నెమ్మదిగా వెనక్కి వాలిపోయింది!!

దాదాపు గంటన్నర తర్వాత, టైము రెండవుతుండగా మెలకువ వచ్చింది విశ్వపతికి. ఏసీ లో ఉన్నా, ఫ్యాన్ తిరుగుతున్నా ఒళ్లంతా చెమటలు దిగకారుతున్నాయి. గుండెని ఎవరో పిడికిట్లో బిగించి నొక్కేస్తున్నట్టు నొప్పి! ఊపిరి అందడం లేదు. తనకి ఆఖరి ఘడియలు సమీపించాయని అర్థమైపోయింది విశ్వపతికి. శక్తి కూడదీసుకుని పక్కకి తిరిగి కౌముది ఎలా ఉందోనని చూశాడు. ఎప్పుడూ లేనిది వెల్లకిలా పడుకుని ఉన్న భార్యని చూడగానే అనుమానం వచ్చింది. చప్పున చెయి జాచి కౌముది నుదుటి మీద ఆనించాడు. శరీరం చాలా చల్లగా తగిలింది. ఆ చల్లదనం విశ్వపతి గుండెల్లో నొప్పిని మరింత పెంచింది. అలాగే నెమ్మదిగా కౌముది మీదకి ఒరిగి, ఆమె ఛాతీ మీద చెవి ఆన్చి విన్నాడు. నిశ్శబ్దం...నిర్జీవ స్థితికి చిహ్నం!! అతి కష్టం మీద లేచి కూర్చుని కౌముది చెయ్యి తన చేతిలోకి తీసుకుని నాడి చూశాడు. నిశ్చలంగా ఉంది. కౌముది వెళ్లిపోయిందని రూఢి చేసుకున్న విశ్వపతికి ఒక్కసారిగా వెక్కిళ్లు మొదలయాయి. ఎగశ్వాస ఒక్కో ప్రాణాన్నీ తోడెయ్యడం ప్రారంభించింది. చెయి జాచి, కౌముది చెయ్యి పట్టుకుంటూ అలా వెనక్కి వాలిపోయాడు! ఎక్కడి నుంచో "బావా.. బావా" అన్న పిలుపు వినిపిస్తోంది. ప్రియమారా ఆ పిలుపు వింటూ కళ్లు మూసుకున్నాడు విశ్వపతి. అతడి శరీరం కూడా నెమ్మదిగా నిశ్చేతనమైంది!!

సూర్యచంద్రులున్నంత కాలం, సృష్టి అవిరళంగా సాగుతున్నంతకాలం మళ్లీ మళ్లీ నువ్వూ నేనే! మిల్తే రహేంగే హమ్ జనమ్... జనమ్!!

★★★

COMMENTS